క్లుప్తంగా

పోషమ్మ బోనాల పండుగ



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బెస్తగేరిలో గంగపుత్రులు పోషమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పసుపు, కుంకుమ, పూలు, వేపాకులు, గంధం తదితర వాటితో అందంగా తయారు చేసిన బోనంలో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకుని మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యాన్ని అమ్మవారికి అర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బాధితులకు ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కడుకుంట్లలో వర్షాల కారణంగా కూలిన ఇళ్లను గురువారం ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి పరిశీలించి, బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని గద్దెనెక్కి తొమ్మిదేళ్లు కావస్తున్నా మొండిచేయి చూపించారని మండిపడ్డారు. కార్యక్రమంలో వెంకట్‌నారాయణ, పాండురావు, సురేష్‌గౌడు, రోహిత్, వెంకటేష్, నాగన్‌గౌడ్, బుచ్చారెడ్డి, రాములు, సర్పంచ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వంటావార్పు



మదనాపురం: మండల కేంద్రంలో సమ్మె చేపట్టిన పంచాయతీ కార్మికులకు గురువారం మండల కాంగ్రెస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. వారు చేపట్టిన వంటావార్పులో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గజ్జల నాగన్న, మండల ప్రధాన కార్యదర్శి జగదీష్ మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. అలాంటి వారిపై బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుండటం తగదన్నారు. కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నిక్సన్, కార్మికులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 22వ రోజుకు చేరుకుంది. గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం, కొత్తబస్టాండ్, రాజీవ్‌చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్దిలేటి, రామచంద్రయ్య, శ్రీనివాసులు, హనుమంతు నాయక్, చంద్రయ్య, నాగరాజు, రాజు, మోహన్, నర్సమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ ఆయా మృతి

అమరచింత: పట్టణంలో అంగన్‌వాడీలో ఆయాగా విధులు నిర్వహిస్తున్న మినిషాఫాతిమా (48) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మినిషాఫాతిమాను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి మూడు రోజుల కిందట కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఆయా మృతి చెందడంతో ఆత్మకూర్ క్లస్టర్ సీడీపీఓతో పాటు మండల అంగన్‌వాడీ టీచర్లు సంతాపం ప్రకటించి మృతురాలి భర్తకు రూ.పదివేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సీడీపీఓ భారతి, సూపర్ వైజర్ నర్మద, టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆత్మకూర్: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకోవడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని మోట్లంపల్లికి చెందిన కుర్వ బాలస్వామి ఆత్మకూర్‌లో తన పని ముగించుకుని సాయంత్రం 6 గంటల సమయంలో స్వగ్రామానికి బయలు దేరాడు. మోట్లంపల్లి స్టేజీ వద్ద బైక్ మలుపుతుండగా అటు వైపు నుండి బైక్‌పై వస్తున్న దేవరపల్లికి చెందిన నరహరి, మన్యం నడుపుతున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈసంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరేందర్ తెలిపారు.

శిథిల ఇళ్లలో నివసించొద్దు



నందిమళ్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జగన్మోహన్

అమరచింత: కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లతో పాటు మట్టి మిద్దెలు కూలిపోయే ప్రమాదం ఉందని, అలాంటి నివాస గృహాల్లో ఎవరూ నివసించొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజా కోరారు. మున్సిపల్ సిబ్బందితో పట్టణంలోని పది వార్డుల్లో శిథిల ఇళ్ల వివరాలపై సర్వే చేయించారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో తిరుగుతూ వర్షాలకు కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లతో పాటు వర్షపు నీరు కారుతున్న ఇళ్లను పరిశీలించారు. ప్రజలు సురక్షితంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, వాటర్ హీటర్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది బాలగోపాల్, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

చిన్నంబావి: రాష్ట్రంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పెద్దదగడలో కూలిన మట్టి ఇల్లును తహసీల్దార్ ఝాన్సీరాంనాయక్, సర్పంచ్ సురేంద్రసింగ్, ఆర్ఐ రాములు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పాత మట్టి మిద్దెలలో నివసించరాదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

వనపర్తి టౌన్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బుధవారం రాత్రి దళితవాడకు చెందిన దస్తగిరి ఇంటి గోడలు ఓ వైపు కూలిపోయాయి. వెనుక వైపు గోడ కూలడంతో ఇంట్లో ఉన్న వారికి ప్రమాదం తప్పింది. మరో వైపు మిగతా గోడలు నెర్రెలు వచ్చాయి. ఈ మేరకు తహసీల్దార్ రాజేందర్‌గౌడ్ వివరాలను నమోదు చేసుకున్నారు.

కొత్తకోట రూరల్: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో దెబ్బతిన్న, కూలిపోయిన ఇళ్లను జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక పరిశీలించారు. అధికారులతో నివేదికలను రూపొందించి నష్టపరిహారం నమోదు చేయించి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం నుంచి సహాయం అందే విధంగా చూస్తామని వామన్‌గౌడ్ తెలిపారు.



అల్వాల-పెద్దమందడి రహదారిపై

రోడ్డుపై పారుతున్న వరదనీరు

పెద్దమందడి మండలంలోని అల్వాల రోడ్డుపై భారీగా వరద పారుతుంది. దీంతో అల్వాల, పెద్ద మందడి గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వరద నీరు భారీగా ప్రవహిస్తుండడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా తహసీల్దార్ సంధ్య, ఎస్ఐ హరిప్రసాద్‌లు ప్రజలను అప్రమత్తం చేశారు.

నదీతీర ప్రాంతాల్లో అప్రమత్తం

ఎగువ నుంచి కృష్ణా నదికి వరద నీరు వచ్చి చేరుకుంటుందని, నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జగన్మోహన్ కోరారు. గురువారం నదీతీర గ్రామాలైన నందిమల్ల, కిష్టంపల్లి, ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. జూరాల బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లరాదని ఆదేశించారు. నారాయణపూర్ డ్యాం నుంచి భారీగా వరద నీరు జూరాల ప్రాజెక్టుకు వచ్చి చేరుకుంటుందని, అలాంటి సమయంలో చేపల కోసం వెళితే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఉధృతంగా కృష్ణానది ప్రవహిస్తున్నందున పర్యాటకులు దూరంగా ఉంటూ నదీ అందాలను చూడాలని సూచించారు.



కొత్తకోట మండలంలో..



పెద్దదగడలో..



అమరచింతలో..

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడి



ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న రామచంద్రరావు తదితరులు

వనపర్తి టౌన్: ఆధునిక వ్యవసాయంతో అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రధానమంత్రి మోదీ ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్సీ ఎస్. రామచంద్రరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాత మార్కెట్ యార్డ్ మన గ్రోమోర్ రైతు సేవా కేంద్రంలో మోదీ 1.25లక్షల కిసాన్ సమృద్ధి సేవా కేంద్రాలను ప్రారంభించే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు, నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతును రాజును చేయడమే లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని, తెలంగాణలో 4వేల రైతు సేవా కేంద్రాలతో రైతులకు మేలు చేకూరనుందన్నారు. రైతులకు సంబంధించిన అన్ని రకాల సేవలు కిసాన్ సేవా కేంద్రాల్లో లభ్యమవుతాయని వెల్లడించారు. కిసాన్ సమాన్ నిధిలో భాగంగా 14వ విడతలో రూ.2.7లక్షల కోట్ల నిధులను విడుదల చేశామని, తెలంగాణలో 39లక్షల మంది లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, బి.కృష్ణ, జింకల కృష్ణయ్య, జిల్లా పదాధికారులు కె.మాధవరెడ్డి, ఎ.రామన్‌గౌడ్, కేతూరి బుడ్డన్న, సుమిత్రమ్మ, కుమారస్వామి, రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, సీతారాములు, శ్రీను, విజయభాస్కర్, పెద్దిరాజు, ప్రభాకర్, పరశురాం, పద్మమ్మ, రాము, గోర్ల బాబురావు, కొమ్ము సామేల్, కదిరె మధు, కల్పన తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం అబ్దుల్ కలాం

వనపర్తి టౌన్: అతి సాధారణమైన కుటుంబంలో జన్మించి ప్రపంచ దేశాలే గర్వించదగ్గ వ్యక్తిగా ఎదిగిన అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, ఈశ్వర్, మండ్ల దేవన్న నాయుడు, బండలయ్య, పాలిటెక్నిక్ సిబ్బంది నవీన్, మణికుమార్, అబ్దుల్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో మాజీ రాష్ట్రపతి, క్షిపణి శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, కృష్ణయ్యగౌడ్, మహ్మద్ కమల్‌పాష, క్యామ బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, నాయకులు

వరద కాల్వ నిర్మాణం చేస్తాం



పనులను పరిశీలిస్తున్న శ్రీధర్

వనపర్తి టౌన్: వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ఉండేందుకు అవసరమైన వరద కాల్వ నిర్మాణానికి చర్యలు చేపడతామని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సాయినగర్ కాలనీ, వెంకగళ్‌రావుకాలనీ, జంగిడిపురం కాలనీల్లో పీర్ల గుట్ట నుంచి వచ్చే వరద నీరు నిలిచి ఉండటంతో పుర సిబ్బందితో గురువారం వరద నీటిని జేసీబీ సాయంతో డ్రెయినేజీలోకి మళ్లించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ప్రతియేటా వర్ష కాలంలో వరద నీరు ఇళ్ల మధ్యలో నిలిచి ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అనారోగ్యం పాలు కావాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన వైస్ చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ మంత్రి నిరంజన్ రెడ్డి, కలెక్టర్ దృష్టికి సమస్య తీవ్రతను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

స్వచ్ఛతను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఆత్మకూర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ సింధూజ, కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలోని మటన్, కూరగాయల మార్కెట్లను పరిశీలించారు. వ్యాపారులు మటన్, కూరగాయలపై ఈగలు వాలకుండా జాగ్రత్తలు, పరిశుభ్రతను పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. 10 రోజులుగా ముసురు వానలు కురుస్తున్నాయని, పాత ఇళ్లల్లో ఉండేవారు వర్షాలు తగ్గే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, డ్రమ్ముల్లో, హౌసుల్లో నిల్వ నీటిని పారబోయాలని, దోమకాటుకు గురికాకుండ జాగ్రత్తలు పాటించాలన్నారు. మున్సిపాలిటీ సిబ్బందితో నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రజలు అసౌకర్యాలు, ఇతర సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.



మటన్ మార్కెట్‌లో పర్యటిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

స్వీపర్ల వినూత్న నిరసన



పెబ్బేరు రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని స్వీపర్లు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 32వ రోజుకు చేరింది. కలెక్టర్ కార్యాలయం సమీపంలో కొనసాగుతున్న దీక్షా శిబిరంలో స్వీపర్లు మోకాళ్లపై కూర్చుని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాసన్న మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్వీపర్లు చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం స్పందించకుండా మొండి వైఖరి అవలంబించడం తగదన్నారు. స్వీపర్లను చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా పాఠశాలలో పనిచేస్తున్న వారికి వేతనం నెలకు రూ.1,623 చెల్లిస్తూ వెట్టి చాకిరీ చేయిస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, ఖాజపాషా, రషీద్, ఖయ్యాం, బాలస్వామి, కురుమన్న, గీత, నాగమ్మ, చంద్రమ్మ పాల్గొన్నారు.

డబ్బాలు తొలగించొద్దని వినతి



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదుట ఉన్న డబ్బాలను తొలగించేందుకు మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజుల క్రితం సిబ్బంది డబ్బాల ముందు ఉన్న రేకులు, తడకలను తొలగించేందుకు వెళ్లగా వ్యాపారస్తులు తొలగించొద్దంటూ ప్రాధేయపడ్డారు. కమిషనర్ ఆదేశానుసారం వ్యాపారులు రేకులు, తడకలను తొలగించారు. అయినా కమిషనర్ డబ్బాలను తొలగించాలని చూస్తుండటంతో తమ డబ్బాలను తొలగిస్తే చిరువ్యాపారం నిర్వహిస్తున్న దాదాపు 20కుటుంబాలు వీధిన పడతామని వారు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్‌ను కలిసి డబ్బాలను తొలగించొదంటూ వినతిపత్రం అందజేశారు. 40ఏళ్లుగా డబ్బాల్లో వ్యాపారం చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నామని, డబ్బాలను తొలగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో భీమన్ననాయుడు, హోటల్ నాగన్న, తిరుపతయ్య, చెన్న మ్మ, నాగరాజు, నాగమ్మ, రాములు, రమేష్, శ్రీకాంత్, మధురెడ్డి, వెంకటేష్, గణేష్, శ్రీను ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవుదూడ మృతి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో ఓ ఆవుదూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన కాగితాల బాలయ్య ఆవు దూడ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. దీంతో ఆవుదూడ అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఆవుదూడ మృతి చెందిందని బాధిత రైతు వాపోయారు. సుమారు రూ.15 వేల విలువ చేసే ఆవుదూడ మృతి చెందడంతో రైతు కంటతడి పెట్టాడు.

ముగిసిన కళాకారుల ప్రదర్శన

పెబ్బేరు: సరస్వతీ కళా సమితి ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా కళాకారుల పోటీలు గురువారం ముగిశాయి. 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఈ పోటీలు పాల్గొన్న కవులు, కళాకారులకు ప్రశంసాపత్రాలు, షీల్డ్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ మాట్లాడుతూ సమాజాన్ని ఉత్తేజపరచడానికి కళలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, సర్వసతీ కళాసమితి అధ్యక్షుడు సర్వారెడ్డి, గౌరవ అధ్యక్షుడు గౌని బుచ్చారెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, సితార వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, కళాకారులుపాల్గొన్నారు.



కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఇంటింటికీ మొక్కల పంపిణీ



అన్నారంతండాలో మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, కార్యదర్శి

పాన్‌గల్: హరితహారం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అన్నారంతండాలో సర్పంచ్ రంగానాయక్ ఆధ్వర్యంలో పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున దానిమ్మ, జామ, బొప్పాయి, ఉసిరి, నిమ్మ, మందార మొక్కలను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. పంపిణీ చేసిన మొక్కలను ఇంటి ఆవరణ, ఖాళీ స్థలాల్లో నాటి వాటిని సంరక్షించాలన్నారు. దీంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెత్తను ఇష్టానుసారంగా కాలనీల్లో పారవేయకుండా పంచాయతీ ట్రాక్టర్ వచ్చిన సమయంలో అందులో వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బొజ్యానాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, రేక్యానాయక్, తండా వాసులు పాల్గొన్నారు.

రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు

పాన్‌గల్: కాలనీలో మురుగు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కేతేపల్లి ఎస్సీ కాలనీల్లో ఆయన పర్యటించి పారిశుద్ధ్య చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కాలనీల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగుతో పాటు వర్షపు నీరు రోడ్డుపైనే నిల్వ ఉండటంతో కాలనీ వాసులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సర్పంచ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ బీరయ్య, కారోబార్ ఆంజనేయులు పాల్గొన్నారు.



కేతేపల్లి ఎస్సీకాలనీలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న అధికారులు

రహదారిపై వరినాట్లతో నిరసన



మస్తీపురం ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

అమరచింత: మండలంలోని మస్తీపురంలో ప్రధాన బీటీ రహదారి బురదమయంగా మారటంతో గ్రామస్తులు గురువారం వరినాటు వేసి నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కోశాధికారి రాజు ఆధ్వర్యంలో నాయకులు గ్రామస్తులతో కలిసి మస్తీపురం, జూరాల ప్రాజెక్టు రహదారిపై నిరసన చేపట్టారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా రహదారి స్థితిగతులు మారడం లేదన్నారు. గత కృష్ణా పుష్కరాల సమయంలో పూర్తి చేయాల్సిన రహదారిని ఇప్పటికీ ప్రారంభించలేదని వాపోయారు. కార్యక్రమంలో మణ్యాం, నాగరాజు, అంజన్న, బాబు, శ్రీను, ఏసు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

కాల్వలోకి భారీగా చేరుతున్న నీరు



గోపాల్‌పేట: రేవల్లి మండలంలో నిర్మించిన పాలమూరు రంగారెడ్డి కాల్వలోకి వర్షం నీరు భారీగా చేరుతోంది. మండలంలోని నాగాపూర్, రేవల్లి సమీపంలో, శానాయిపల్లి నుంచి కాల్వ ఉండగా నాగపూర్ పరిసరాల్లో కురిసిన వర్షానికి వరద భారీగా పెద్దకాల్వలోకి ప్రవహిస్తోంది. దీంతో ఏదుల రిజర్వాయర్‌లోకి నీరు భారీగా చేరుతోంది. ప్రాజెక్టులో మునకకు గురవుతున్న బండరావిపాకుల ప్రజలను అప్రమత్తం చేశామని, వారికి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీరాములు చెప్పారు.

ఘనంగా ఖాసీం పీర్ల ఆలయ్ బలయ్



అమరచింత: పీర్ల పండుగను పురస్కరించుకొని పట్టణంలో గురువారం కాసీం పీర్ల సవారీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని నందిమళ్ల, మస్తీపురం, పాంరెడ్డిపల్లి, చంద్రగఢ్ గ్రామాలని కాసీం పీర్లను ఊరేగిస్తూ మండల కేంద్రానికి చేరుకున్నారు. పట్టణంలోని కర్బాలా ప్రాంతంలో కాసీం పీర్ల ఆలయ్, బలయ్ ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం పీర్లను నిమజ్జనానికి తరలించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ జగన్మోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రోడ్లన్నీ గుంతలమయం



ఆత్మకూర్‌లో రోడ్లపై నిలిచిన నీటిని మళ్లిస్తున్న పుర కార్మికులు

ఆత్మకూర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ ధ్వంసమై యమపురికి దారులుగా మారుతున్నాయి. మున్సిపాలిటీ కేంద్రంలో గాంధీచౌక్ నుంచి అమరచింత వైపు, బస్టాండ్ రోడ్డు, కొత్తకోట వైపు, పాత మున్సిపాలిటీ వైపు రోడ్డు నాలుగు దిక్కుల గుంతలమయంగా మారాయి. రోడ్లపై గుంతల్లో వర్షపునీరు చేరడంతో గుంతలను అంచనా వేయని వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ గాయాలపాలవుతున్నారు.

త్వరలోనే మరమ్మతు



ఆత్మకూర్‌లో రోడ్డు విస్తరణ అయిన అనంతరం ఇరువైపుల డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టాం. నాలుగు దిక్కుల రోడ్ల విస్తరణ ఆవశ్యకతను మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రూ.5కోట్లు నిధులు మంజూరు చేశారు. త్వరలోనే రోడ్ల నిర్మాణాలు చేపడుతాం. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నాం.

– గాయత్రి, చైర్‌పర్సన్

ఇబ్బంది పడుతున్నాం...



ఆత్మకూర్‌లో గాంధీచౌక్ నుంచి రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నాం. ఇతర ప్రాంతాలకు చెందిన వారు రోడ్లపై ఏర్పడిన గుంతలను అంచనా వేయలేక కిందపడి గాయాలపాలవుతున్నారు. వెంటనే గుంతలను పూడ్చి శాశ్వతంగా కొత్త రోడ్లను నిర్మించాలి.

– బాలు, ఆత్మకూర్